# అనుబంధాలు

-అరుణ

వంటగది అల్మరాలో డబ్బాలు సర్దుతూ జగన్మాత సౌందర్యాన్ని వర్ణించే లలితా సహస్రనామాల్లోని శ్లోకాలను నెమ్మదిగా ఉచ్ఛరిస్తోంది శాంత. అమ్మ పెట్టిన మైసూర్‌పాక్ తిని, మంచినీళ్లు తాగబోతున్న అజయ్ చెవులకు మృదుమధురంగా వినిపించాయి లలితా సహస్ర నామాలు.

"నాసాభరణమంటే ఏమిటమ్మా?" తల్లిని అడిగాడు.

డబ్బాలు తుడిచి శుభ్రం చేస్తూ తల తిప్పి కొడుకువైపు చూసి నవ్విందామె.

"నాసాభరణమంటే ముక్కుకు పెట్టుకునే నగ. జగదాంబ నాసికకు అలంకరించుకున్న ఆభరణం కాంతివంతంగా మెరుస్తోందని అర్థం"

ఆరవ తరగతితో చదువుకు స్వస్తిపలికిన ఆ ఇల్లాలు తనకు తెలిసిన అర్థం వివరించింది.

'ఓహో...అలాగా' అన్నట్లు తలూపాడు పన్నెండేళ్ల అజయ్. గుడిలో అమ్మవారి విగ్రహానికి అమర్చి ఉండి తెల్లగా తళుక్కుమని మెరిసే ముక్కుపుడక గుర్తుకొచ్చిందతనికి.

"నువ్వు కూడా తెల్లగా తళుక్కుమని మెరిసే ముక్కుపుడక పెట్టుకో. నీకు చాలా బాగుంటుందమ్మా" అన్నాడు అమాయకంగా.

"అది డైమండ్ ముక్కుపుడక. చాలా ఖరీదుంటుంది తెలుసా?" అల్మరాలో కాగితాలు వేసి అమ్మకు ఇంటి పనుల్లో సాయం చేస్తున్న అజయ్ అక్క సుధ అంది.

"ఖరీదు వుంటుందా?" నిరాశగా చూసాడు కొద్దిక్షణాలు.

"అమ్మా! నేను పెద్దయ్యాక డబ్బు సంపాదించి నీకు మెరిసే ముక్కుపుడక కొంటాను" తల్లి చీర కొంగుతో పెదవులకు అంటిన తడిని తుడుచుకుంటూ అన్నాడు.

మృదువుగా నవ్వింది శాంత.

పక్కింటి సాంబశివ పిలుపు వినిపించింది బయట.

గోళీలాట ఆడేందుకు రివ్వున బయటకు పరుగెత్తాడు అజయ్.

అప్రయత్నంగా కుడిచేతి మధ్య వేలితో తన ముక్కుపుడకను తడుముకుంది శాంత. వివాహానికి ముందు ఆమె తల్లిదండ్రులు చేయించిన నగ అది. చిన్న ఎర్రరాయితో అతి తక్కువ బంగారంతో చేసిన ముక్కుపుడక.

కొత్తలో బాగానే ఉన్నా ఈమధ్య బాగా వన్నె తగ్గిపోయింది. రవ్వల ముక్కుపుడక చేయించుకోవాలని ఆమెకు ఎప్పటినుంచో కోరిక.

భర్తను ఒకటి రెండుసార్లు నోరు తెరిచి అడిగింది కూడా. 'చూద్దాంలే' అనేశాడాయన చుట్ట కాల్చుకుంటూ. అజయ్ తమ సంభాషణ విన్నాడేమో! అందుకే తాను పెద్దయ్యాక కొని పెడతానని చెప్పాడు.

కొద్దిసేపటిక్రితం కొడుకు అన్న మాటలు గుర్తుకొచ్చి మురిపెంగా నవ్వుకుందామె. మరుక్షణం పనిలో లీనమైంది శాంత.

★★★

సమయం రాత్రి ఏడుగంటలవుతోంది.

ఆఫీసు నుండి అలసటగా ఇంటికి చేరుకున్నాడు అజయ్.

స్నానం చేసాక హాయిగా అనిపించింది. అలసట మటుమాయమైంది.

భార్య అందించిన జ్యూస్ గ్లాస్ అందుకున్నాడు.

భర్త పక్కన సోఫాలో కూర్చుంది అనంత.

అతనికేదో సందేహం కలిగి తలతిప్పి ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసాడు క్షణకాలం. ముక్కు బోసిగా ఉంది.

"ముక్కుపుడక తీసావా?" అడిగాడు.

అవునన్నట్లు తలూపింది.

ప్రశ్నార్థకంగా చూసాడు భార్యవైపు.

"ఉదయం నలుగు పెట్టుకుని తల స్నానం చేసేటప్పుడు చెవిపోగులు, ముక్కుపుడక తీసాను. తరువాత చెవిపోగులు పెట్టుకున్నాను. కానీ ముక్కుపుడక పెట్టుకోవడం మరచిపోయాను" నొచ్చుకుంది అనంత.

ఫర్వాలేదన్నట్లు నవ్వాడు.

తన ముక్కుపుడక అంటే భర్తకు చాలా ఇష్టమని ఆమెకు తెలుసు.

లేచి వెళ్లి డ్రెస్సింగ్ టేబుల్ సొరుగులో ఉన్న ముక్కుపుడక తెచ్చింది. అతని పక్కన కూర్చుని ఆభరణానికి ఉన్న సీల నెమ్మదిగా వేరు చేసింది. తలకొద్దిగా ఎడమవైపుకు తిప్పుకుని నాసికకు అమర్చబోయింది.

ఖాళీ గ్లాసు పక్కన పెట్టాడు అజయ్.

సోఫాలో నుండి లేచి కింద మార్బుల్ ఫ్లోరింగ్ మీద కూర్చున్నాడు. చిరునవ్వుతో కుడి చేయి చాపాడు.

అతని ఉద్దేశ్యం అర్థమయిందామెకు.

గుమ్మంవైపు చూసింది. ఫ్లాట్ తలుపుతీసి ఉంది.

తన చేతిలో వున్న వాటిని అజయ్ చేతిలో ఉంచి లేచి తలుపు వేసి బోల్టు పెట్టింది.

భర్తకు చేరువగా కింద కూర్చుని తల కొద్దిగా వంచింది అతనికి అనుకూలంగా.

ఆమె నాసికకు ఆభరణం అమర్చాడు అపురూపంగా.

సంపెంగ వంటి అనంత ముక్కుకు చక్కగా అమరిన రవ్వల ముక్కుపుడక ఆమె అందాన్ని మరింతగా ఇనుమడింపజేసింది.

ఆమె కొద్దిగా పక్కకు కదిలింది.

ట్యూబ్‌లైట్ కాంతి ప్రతిఫలించి డైమండ్ ముక్కుపుడక తళుక్కుమని మెరిసింది.

అతని ఒడిలో ఇష్టంగా తల పెట్టుకుని పడుకుంది.

భార్య ముద్దుమోము చూస్తూ అలాగే కూర్చుండిపోయాడు.

అతని చేతులు సపోర్ట్ కోసం అన్నట్లుగా

ఫ్లోరింగ్ మీద రెండు వైపుల ఆన్చి ఉన్నాయి.

ఆ నిశ్శబ్దం చాలా బాగుంది.

అనంత వయసు 21 సంవత్సరాలు. ఆమెకంటే వయసులో రెండేళ్ళు పెద్దవాడతను. ఒత్తిగిల్లి పడుకోవడంతో పక్కకు వచ్చి ఆమె మెడలో నుండి తొంగి చూస్తున్న మంగళసూత్రం గొలుసును స్పృశించాడు.

కళ్లు తెరిచిందామె. అజయ్ ముఖంలోకి చూసి నవ్వింది.

సరిగ్గా నెలరోజుల క్రితం వారి వివాహమైంది. పెళ్లయిన మూడురోజుల తరువాత ఆమె ముఖంలోకి పరిశీలనగా చూసి ఒకింత మొహమాటపడుతూ ఓ ప్రశ్న అడిగాడతను.

నవ వధువు ఆశ్చర్యంగా తలెత్తి చూసింది.

ఆమె సమాధానం చెప్పకపోవడంతో మళ్లీ అడిగాడు "ముక్కుపుడక అంటే నీకిష్టమేనా?"

ఆమె కొద్దిక్షణాలు ఆలోచించింది.

"ఇష్టమూలేదు, అయిష్టమూలేదు. ముక్కుపుడక గురించి ఎప్పుడూ ఆలోచించలేదు" అంది.

"నువ్వు ముక్కుపుడక పెట్టుకుంటే చూడాలని



నా కోరిక. ప్లీజ్ పెట్టుకోవూ?'' అభ్యర్థనగా అడిగాడు.

అనంతకు వింతగా అనిపించింది. అంగీకార సూచకంగా తలూపింది.

"థాంక్స్'' అన్నాడు ఆనందంతో ఉప్పొంగిపోతూ.

ఆమె చేతిని మృదువుగా తన చేతుల్లోకి తీసుకున్నాడు.

భర్త తన అరచేతిలో పెట్టిన ముక్కుపుడక వైపు ఆశ్చర్యంగా చూసింది.

డైమండ్ ముక్కుపుడక కాంతులీనుతూ ఉంది.

"నీకు ఇది నచ్చితే పెట్టుకో. లేదా నీకు ఇష్టమైన మోడల్ తీసుకో'' అన్నాడు.

"బావుంది. ఇదే పెట్టుకుంటాను'' అంది.


***

మర్నాడే ముక్కు కుట్టించుకుంది.

ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసింది ముక్కుపుడక.

## చదరంగం కనిపెట్టిందెవరు?

చదరంగం చైనీయులు, పర్షియన్లు, భారతీయులు కనిపెట్టారు. చైనీయులు దీనిని చోంగ్‌కీ లేక రాయల్‌గేమ్ అనేవారు. మొట్టమొదట 174 బిసిలో ఒక చైనా సైనికాధికారి షెన్‌సీ దేశంపై దండెత్తినప్పుడు ఊరికే కాలం గడపడానికి దీనిని ఆడాడు. పర్షియనులు దీనిని కనుగొని తర్వాత భారత దేశంలో ప్రవేశపెడితే భారతీయులు దీనిని మరింత అభివృద్ధి చేశారు అంటారు. ఆంగ్లేయ పండితుడు సర్ విలియం జోన్స్ భారతదేశంలో చెస్ ప్రారంభమైందని అక్కడ దీనిని చదరంగం అంటారని, చదరంగం అంటే ఏనుగులు, గుర్రాలు, రథాలు, బంట్లు అనే సైన్యంతో నాలుగు అంగబ



లాలు చదరంగంలో పావులుగా ఉంటాయని 1783లో రాశాడు. భారత దేశం నుంచి ఈ ఆట పర్షియాకు వెళ్లింది అని ఇంకో నానుడి. అక్కడ వారు దీనిని చతురంగ్ అన్నారు. అరబ్బులు తర్వాత ఈ పేరును షత్‌రంజ్‌గా మార్చారు. దీనినుండే ఇంగ్లీషులో చెస్ అనే పదం ఏర్పడింది. ప్రొఫెసర్ డంకన్ పొర్బెస్ చదరంగం 3000 బిసినాటదని నిర్ణయించాడు. డచ్ పండితుడైన వాన్‌డెర్‌లిండే చదరంగాన్ని హిందువులు కాదు బౌద్ధులు కనిపెట్టారని వాదిస్తాడు. జీవహింస చేయకుండా పావులను చంపవచ్చుని, వారి కలహ స్వభావాన్ని వదుల్చుకోవడానికి, కాలక్షేపానికి దీనిని ఆడేవారని అంటాడు.

-బిపిఆర్

చక్కటి మేనివర్ణం ఆమెది. తీర్చిదిద్దినట్లు ఉండే కనుముక్కు తీరుతో కళకళలాడుతూ ఉంటుంది అనంత ముఖం. ఇప్పుడు ఆమె అందం రెట్టింపయింది.

"పిల్లకు నా దిష్టే తగులుతుంది'' అని భయపడి తల్లి దిష్టి తీసింది వెంటనే.

అతను ఉద్యోగం చేస్తున్న ఊరికి అనంతను తీసుకొచ్చి ఒకరోజు ఉండి తిరుగుప్రయాణమయ్యారు ఆమె తల్లిదండ్రులు.

***

కొత్తకాపురం ముద్దుమురిపాలతో సాగుతోంది.

భర్త వద్దకు వచ్చాక ఓరోజు జలుబుచేసి పదే పదే తుమ్ములు వస్తుంటే ముక్కు శుభ్రం చేసుకోవడం ఇబ్బందిగా అనిపించి ముక్కుపుడక తీసింది.

మర్నాడు నిద్రపోతున్న అనంతకు ముక్కుపుడక అలంకరించాడతను. మెలకువ వచ్చినా కూడా ముక్కుమీద, కుడి చెంపమీద ఆత్మీయతతో కూడిన అతని చేతివ్రేళ్ల స్పర్శను ఆస్వాదిస్తూ అలాగే కళ్లు మూసుకుని కదలకుండా ఉండిపోయింది.

ఇదిగో మళ్లీ ఈ రోజు తలస్నానం చేసేముందు ముక్కుపుడక తీస్తే అతనే స్వయంగా అలంకరించాడు.

ఈ చిన్న ఆభరణం మీద అతనికి అంత మక్కువ ఎందుకు?

కారణం తెలుసుకోవాలనిపించింది. బాసింపట్టు వేసుకుని కూర్చున్న అజయ్ కాలిమీద తల పెట్టుకుని పడుకున్న అనంత అతని చేతిని ఇష్టంగా తన చేతుల్లోకి తీసుకుంది.

"మీకు నా ముక్కుపుడక అంటే ఎందుకంత ఇష్టం?'' అడిగింది.

అతను నవ్వాడు.

ఆ నవ్వు వెనుక బాధావీచిక అస్పష్టంగా కదలాడింది.

ఆమె నాసికను ప్రేమగా స్పృశించాడు.

"మా అమ్మకు రవ్వల ముక్కుపుడక కొనాలని నా కోరిక. అమ్మకు కూడా ఈ నగ అంటే చాలా ఇష్టమని నాకు తెలుసు. దిగువ మధ్య తరగతి కుటుంబం మాది. పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్టుగా ఆదాయం పెరగని కుటుంబాల్లో తల్లి తన పిల్లల అవసరాలు తీరుస్తుంది కానీ తన ఇష్టాల గురించి పట్టించుకోదు. మా అమ్మ కూడా అదే పని చేసింది.

అమ్మకు పెళ్లికి ముందు అమ్మమ్మ వాళ్లు ముక్కు కుట్టించి ఎర్రరాయి ముక్కుపుడక పెట్టి పంపించారు. నేను పెరిగి పెద్దయ్యాక అమ్మకు డైమండ్ ముక్కు పుడక కొంటానని చాలాసార్లు చెప్పాను. అమ్మ నవ్వి ఊరుకునేది. ఉద్యోగంలో చేరి మొదటి నెల జీతం అందుకున్నాను. బంగారం షాపుకు వెళ్లి అమ్మకోసం ఈ ముక్కుపుడక తీసుకున్నాను. రెండురోజులు సెలవు కలసి వస్తే ఆనందంగా ఊరికి వెళ్లాను.

ఈ కానుక చూడగానే అమ్మ ముఖంలో కదలాడే సంతోష తరంగాలు చూడాలని మనసు తహతహలాడింది. నేను వెళ్ళేటప్పటికి అమ్మ తీవ్రమైన ఆయాసంతో బాధపడుతోంది. అమ్మ అనారోగ్యం గురించి ఇన్నాళ్లు నాతో చెప్పకుండా గోప్యంగా ఉంచారని అర్థమైంది. ఆమె వారిస్తున్నా వినకుండా వెంటనే ఆస్పత్రిలో చేర్పించాను. కానీ దైవం చిన్నచూపు చూసాడు. మర్నాడు అమ్మ కన్ను మూసింది.

డైమండ్ ముక్కుపుడక చూడకుండానే, పెట్టుకోకుండానే అమ్మ వెళ్లిపోయింది. ఎన్నాళ్లనుండో ఉన్న కోరిక కలగానే మిగిలిపోయింది. ముక్కుపుడకను అక్కకు ఇవ్వబోయాను. తను తీసుకోలేదు. 'ఇంత విలువైన కానుక నాకెందుకు? పెళ్లయ్యాక నీ భార్యకు ఇవ్వు' అంటూ బీరువాలో భద్రం చేసింది. బావ కూడా అక్క మాటలతో ఏకీభవించాడు. మన పెళ్లయిన తరువాత నీ ఇష్టాఇష్టాలు తెలుసుకుని నువ్వు అంగీకరిస్తే ఇవ్వమని అక్క గుర్తు చేసింది. ఈ నగ పెట్టుకోవడానికి నువ్వు ఒప్పుకోవడం నాకు చాలా ఆనందంగా అనిపిం

చింది. పోయిన అమ్మను ఎలాగూ తిరిగి తెచ్చుకోలేను. తనకు, నాకు ఇష్టమైన ఆభరణాన్ని నువ్వు అలంకరించుకుని నా కళ్లముందు తిరుగుతుంటే మన సుకు తృప్తిగా అనిపిస్తుంది'' తల్లిని తలచుకోవడంతో అతని కళ్లు చెమ్మగిల్లాయి.

అప్పటివరకూ అజయ్ ఒడిలో పడుకుని వింటున్న అనంత లేచి కూర్చుంది.

"మీకు, అత్తయ్యకు ఇష్టమైన నగను ఇంకెప్పుడూ తీయను. తీసినా వెంటనే మళ్లీ పెట్టుకుంటాను'' అంది భర్తవంక ఆరాధనగా చూస్తూ.

అతను కొద్ది నిముషాలు నిశ్శబ్దంగా ఊరకుండిపోయాడు.

ఆమెతో ఏదో చెప్పాలనుకుని తటపటాయించాడు.

"నాతో ఏదో చెప్పాలనుకుంటున్నారు కదూ చెప్పండి'' అంది.

"అమ్మ చనిపోయాక గత ఏడాది నుండి నాన్న ఒంటరిగా పల్లెలో కాలం గడుపుతున్నారు. నా దగ్గరకు వెంటనే తీసుకువస్తే ఆయన సర్దుకుపోగలరో లేదో, నేనూ ఒంటరివాడినే కదా అనే సందేహంతో ఇన్నాళ్లు ఆ ప్రయత్నం చేయకుండా ఆగిపోయాను.

ఇప్పుడు నా జీవితంలోకి నువ్వు ప్రవేశించావు. అమ్మను ప్రేమగా చూసుకోలేకపోయానని, తనకు సేవ చేయలేకపోయానన్న బాధ నన్ను కలచివేస్తోంది. నాన్నను ఇక్కడికి తీసుకువచ్చి అపురూపంగా చూసుకోవాలని నా కోరిక. అందుకు నీ సహకారం కూడా కావాలి. నువ్వు మనస్ఫూర్తిగా ఒప్పుకుంటేనే నాన్నను ఇక్కడికి తీసుకువస్తాను'' చెప్పడం ఆపి భార్య ముఖంలోకి చూసాడు.

అనంత పెదవుల మీద చిరునవ్వు తొంగి చూసింది.

"ఈ మాట నేనే చెప్పాలనుకుంటున్నాను. మామయ్య పల్లెటూరిలో ఒంటరిగా ఉండాల్సిన అవసరమేముంది? మన దగ్గరకు వస్తే బావుంటుంది కదా అని ఈ నెలరోజుల్లోను చాలాసార్లు అనిపించింది. ఇప్పుడు మీరు కూడా అదే మాట అన్నారు. రేపే ఊరికి వెళ్లి మామయ్యను ఇక్కడికి తీసుకువచ్చేద్దాం'' అంది ఉత్సాహంగా.

"కానీ ఒక మాట'' అన్నాడు.

చెప్పుమన్నట్లు చూసింది.

"నాన్నకు చుట్టలు తాగే అలవాటు ఉంది. ఆ అలవాటు ఆరోగ్యానికి హానికరమని మనకు తెలుసు. అమ్మ ఆరోగ్యం పాడవడానికి నాన్నకు ఉన్న చుట్టలు తాగే అలవాటే కారణం కావచ్చు బహుశ. నాన్న ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనమీద ఉంది. ఆయనకు ఉన్న ఈ ఒక్క దురలవాటును నెమ్మదిగా మాన్పించాలి. నాన్న ఇక్కడికి వచ్చాక నేను ప్రయత్నించి ఆయన క్రమంగా ఈ అలవాటు మానుకునేటట్లు కృషి చేస్తాను. కొన్నాళ్లు ఈ విషయంలో నువ్వు ఓపికతో భరించాలి. ఇప్పుడు చెప్పు నాన్నను ఇక్కడికి తీసుకురావడం నీకిష్టమేనా?'' అడిగాడు.

అంగీకార సూచకంగా తలూపింది.

"పెద్దవాళ్లకు బలహీనతలు ఉండవచ్చు. ఆ బలహీనతలను చూసి మనం అసహ్యించుకుని వారిని దూరం చేసుకోకూడదు. దురలవాట్లకు వాళ్లు స్వస్తి చెప్పేందుకు మనం మనోబలం అందిస్తే వారిలో మంచి మార్పు వచ్చే అవకాశముంది. మనం తప్పకుండా ఆ దిశలో కృషి చేద్దాం. వెంటనే మామయ్యను ఇక్కడకు తీసుకురావాలి. ఆ తరువాత పొగాకు అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించండి'' అంది.

"నాన్నను ఇక్కడకు తీసుకురావడం జరిగితే శాశ్వతంగా మనతోనే ఉంటారు. నువ్వు ఆయనను ఎన్నడూ విసుక్కోవుకదూ'' అభ్యర్థనగా అడిగాడు.

చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులను ఆదరించే విషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకుంటున్నాయన్న వాస్తవం అతనికి తెలుసు. అందుకే అలా అడిగాడు భార్యను.

"ఊహూ.. ఎన్నడూ విసుక్కోను. ఆయనకు సంతోషంగా సేవ చేసుకుందాం. నేనెప్పుడైనా మామయ్యను సరిగా చూడడం లేదు అన్న ఫీలింగ్ మీకు కలిగితే నన్ను మందలించి రెండు దెబ్బలు వేసి దారిలో పెట్టుకోండి. భార్యను తనకు అనుకూలంగా మార్చుకోవాల్సిన బాధ్యత, సవ్యమైన దారిలో నడిపించాల్సిన బాధ్యత భర్తదే సుమా'' నేను చెప్పింది కరక్టే కదా అన్నట్లు నవ్వింది తమాషాగా.

"అమ్మో...గృహహింస నిరోధక చట్టం అమల్లో ఉంది. నిన్ను కొట్టడమా? కొడితే ఏం జరుగుతుందో తెలుసా?'' సరదాగా అన్నాడు.

హాయిగా నవ్వింది అనంత.

"ఏమీ జరగదు. రేపు ఊరికి వెళ్లి మామయ్యను తీసుకువద్దాం'' అంది.

ఆమె నాసాభరణం తళుక్కుమంటూ మెరిసింది.

★

## పేకముక్కలలో నలుగురు రాజులు

మధ్యయుగపు రోజులలో ఇంగ్లండ్‌లో పేక ఆట చాలా ప్రసిద్ధిలో ఉండేది. ఆరోజులలో నలుగురు ప్రసిద్ధి పొందిన మహా చక్రవర్తులు ఉండేవారని విశ్వసించేవారు.ఆ నలుగురు రాజులను పేకముక్కలు సూచిస్తాయి.

★ హార్ట్స్‌కింగ్ (అరకు రాజు): 800ఏడిలో రోమన్ సామ్రాజ్యాన్ని నిర్మించిన చార్లెమాగ్నె.




★ డైమండ్ కింగ్ (డైమండ్ రాజు): యుద్ధపు గొడ్డలి ధరించిన రోమ్ జూలియస్ సీజర్.

★ స్పేడ్స్ కింగ్ (ఇస్పేట్‌రాజు): ఇజ్రాయిల్‌ను పాలించినరాజు డేవిడ్. ఇతనే గోలియత్‌ను హతం చేశాడంటారు.

★ క్లబ్స్ కింగ్ (కళావరు రాజు): ప్రపంచ సామ్రాజాన్ని సూచించే గోళాన్ని చేతిలో పెట్టుకున్న అలెగ్జాండర్ ది గ్రేట్.

-బిపిఆర్